# శ్రీ రమణ జ్యోతి

ఫిబ్రవరి 2023

ఈ సంచికలో ...

# Sri Ramana Jyothi

February 2023

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 103వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీదేవీ కాలోత్తర జ్ఞానాచార విభాగము** | తాడిమేటి సత్యనారాయణ | 8 |
| **3.** | **శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్)** | జి. శ్రీహరిరావు | 19 |
| **4.** | **శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | 25 |
| 5. | Becoming Fearless | Dr K Subrahmanian | 30 |
| 6. | Ashtavakra Gita - 9 | V Krithivasan | 36 |
| 7. | Dispassion Through Discrimination | G Ramana Rao | 42 |
| 8. | Ramana Yoga Sutras | Sri Krishna Bhikshu | 47 |


## Events in Sri Ramana Kendram in February 2023

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 4th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.


**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**

**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# ఏమీ ఆశించని మహానుభావులు

డా॥ కే.యస్. గారి 103వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

జరిగే ప్రతీదీ భగవదేచ్ఛ. ఆ విశ్వ ప్రభువు ఏమేమి చేయ గలడన్నది మనం వర్ణించలేము. మనం ఐశ్వర్యాన్ని కోరుకుంటాం. అసలు ఐశ్వర్యమంటే ఏమిటి? అసాధారణమైన ఆనందాన్నిచ్చేది ఐశ్వర్యం. మరి ఆనందం? దేవుని స్మరించి ఆయన కరుణిస్తే అప్పుడు ఆ అసాధారణమైన ఆనందం కలుగుతుంది. కాని మనం సుఖ, సంతోషాలను లౌకిక సంపదలు ఇస్తాయని భావిస్తాం. వాటిని గురించి ఆలోచిస్తూ అవే అన్నీ అని అనుకుంటాం. తనలో ఒకడిగా భగవంతుడు చేసుకున్నాడన్న స్థితిని ధృఢపరిచే స్థితియే యథార్థమైన ఐశ్వర్యం.

## క్రమేపి మార్పు

వెంకట్రామన్‌గా తన తండ్రిని వెదకుతూ తిరువణ్ణామలై వచ్చి మొదట బ్రాహ్మణ స్వామిగా గుర్తింపబడి, రమణులై ఆఖరుకు అరుణాచలంలో ఐక్యమయ్యారు. రమణునికీ, అరుణా చలానికీ బేధం లేదు. యాభై ఏళ్ళ పాటు ఒక నిమిషం పాటు కూడ ఎక్కడికీ కదలక అక్కడే వుండిపోయారు. కాని ప్రపంచ వ్యాప్తంగా జనాన్ని తమ వైపుకు ఆకర్షించుకున్నారు. ఆయన తొలి దశల్లో పాటించినది కేవలం మాట్లాడకుండ వున్న మౌనస్వామి - శబ్ద మౌనం కాదు, మానసిక మౌనం. శుద్ధ చైతన్యంగా వుండి భగవాన్‌గా మారిపోయారు.

గొప్ప సాధువును కలిసినప్పుడు మనసు ప్రశాంతతో నిండి పోతుంది. ప్రసిద్ధ ఆచార్యుల దర్శనం చేసుకున్నప్పుడు, శ్రీకృష్ణుడు శ్రీరాముని వంటి దేవుళ్ళను గురించిన ధ్యాస వుంచినప్పుడు మనసు నిశ్చలమౌతుంది, కొంతకాలం పాటు శాంతిని అనుభవించడం జరుగుతుంది. అదే ఒక మతి స్థిమితంలేని వ్యక్తిని గురించి ఆలోచించినప్పుడు మనసు కలత చెందుతుంది. ప్రస్తుత కాలంలో వార్తా పత్రికలు ప్రధానంగా హింస, హత్యలు, మానభంగాల వంటి అసాంఘిక సంఘటనలను ప్రచురిస్తున్నందున వాటిని చదివిన తరువాత మనసు అశాంతికర భావాలతో నిండిపోతుంది. రోజంతా ఆ అవాంఛిత ప్రభావం వెంటాడుతుంది.

## సమస్యల పరిష్కారం

అందుకే ఉదయాన్నే మేలుకొన్న తరువాత దేవుడిని తలచు కొని ధ్యానం చేయాలని పెద్దలు చెబుతారు. ఏదో రెండు గంటలు, మూడు గంటలని కాదు ఒక పది నిమిషాల పాటైనా సరే అలా ధ్యానిస్తే రోజు మొత్తం సవ్యంగా శాంతంగా వుండడానికి వీలవుతుంది. అదే విధంగా మనసు నుంచి ఏకాగ్రతతో పూజలో గడిపినప్పటికి రోజంతా ప్రశాంతత ఏర్పడుతుంది. ఇది మనకి అనుభవపూర్వకంగా తెలుసు. సమయం లేదని, లేదా మరేదో సాకులతో అలాంటి కార్యక్రమాలను దాటవేస్తుంటాము. పది నిముషాల సేపైనా సరే తీవ్రమైన ధ్యానంలో గడిపితే, రోజులో అరగంట సేపు చేయాల్సి వచ్చే పనిని సులువుగా పది నిమిషాలలో ముగించేయగలం. ఎందుకంటే కలిగే ప్రశాంతత రోజువారీ

సమస్యలను అద్భుతంగా ఎదుర్కొనే శక్తినిస్తుంది. ఇది అనుభవానికి సంబంధించినది గాని వాదించదగిన వివాదాంశం కాదు.

మనకు శాంతిని ప్రసాదించేవారు - వేదాంత వాక్యేషు సదారమంతః । భిక్షాన్నమాత్రేను తుష్టిమంతః వారు శాంతిలో రమిస్తూ, భిక్షా మాత్రంతో సంతుష్టి చెందుతుంటారు. విశోక వంతః కరణైక వంతః - ఏ విధమైన శోక, దుఃఖాలను అనుభవించక, ఎవరి నుండి ఏమీ ఆశించకుండ ప్రశాంతంగా వుంటారు. ఆదిశంకరులు అంటారు, ఉపనిషత్తులూ అవే చెబుతాయి. ఆత్మారామో మహాభాగో - తమలోపలె బ్రహ్మాండమైన శాంతిని పొందుతూ బాహ్యం నుండి ఏదీ వాంఛించరు. మన విషయానికి వస్తే, అప్పుడప్పుడు లభించే శాంతి అలాగే ఎడతెగకుండా వుంటే, వున్న దానితో తృప్తి చెందడానికి వీలు అవుతుంది. కాని గమ్మత్తు ఏమిటంటే మనం ఈ విషయాన్ని నమ్మము.

ఇతరులు ఏదైనా ఇవ్వడానికి సిద్ధంగా వున్నప్పటికీ అసలైన సాధువులు, జ్ఞానులూ, బయటి నుండి ఏమీ స్వీకరించరు. కాని నేను మిమ్మల్ని ఏదైనా కావాలని అడిగితే, ఒకటికి, రెండుసార్లు ఇస్తారేమోగాని, ఆ తరువాత నుండి మనల్ని తప్పించుకుని తిరుగుతారు. మరొకవైపు ఏమీ వాంఛించని వాళ్ళను ఏమీ కావాలని మరీ మరీ అడిగి ఇస్తారు. కాని సాధువులకు కావల్సింది ఏముంటుంది, చాలా కొంచెం మాత్రమే భుజిస్తారు. ఇతరులు ఏ ఫలమో ఇచ్చినప్పటికీ, దానిని తిరిగి ఇతరులకు ఇచ్చేస్తారు.

భగవాన్ తమకు తరువాతి పూటకు ఏమి, ఎలాగు అని ఆలోచించి ఎరుగరు. ఏదైనా మిగిలితే, అప్పుడే ఇతరులకు పంచమనేవారు. ఆశ్రమం స్థాపన వరకూ మహర్షి జీవితం అలాగ గడిచింది.

## త్యాగానికి మారు పేరు

కొన్ని ఏళ్ళ పాటు భగవాన్‌కు తలగడ వుండేది కాదు. అసలు మొదట తువ్వాలు కూడా లేదు. స్నానం చేసిన తరువాత, శరీరం తడి ఆరే వరకూ అలాగే నిల్చుండి పోయేవారు. త్యాగమంటే అది. ఎవరైనా తువ్వాలు ఇచ్చేవారు. కాని దాని అవసరం ఏమిటి అని అనేవారు. కొలను గట్టు మీద ఎండలో నిలబడి శరీరాన్ని ఎండనిచ్చే వారు. అది త్యాగం, అది వైరాగ్యం. మనం కూడ వైరాగ్యాన్ని కోరు కోవచ్చు, అందరికీ నచ్చవచ్చు. కాని అన్నీ యిచ్చి వేయడం ఆచరణ యోగ్యమా అని అనుమానం వస్తుంది. మనకు అవసరమైనవే కాకుండా అవసరాలకు మించి భగవంతుడు మనకు ప్రసాదిస్తాడు. ఎక్కువ వుంచుకోరన్న అభిప్రాయంతో, మహర్షి అలాగే ఆచరించే వారు. తమ జీవితం మొత్తం అలాంటి త్యాగాలతో సాగింది. సాధారణ వ్యక్తులం అన్నీ ఇచ్చేసి ఆస్తిని వదిలివేయవచ్చునేమో, జీవనసరళిని మార్చుకొనగలవేమెూ గాని అహంకారాన్ని వదలుకొనడం విపరీతమైన కష్టం, అసాధ్యమనిపిస్తుంది. అసలు అహంకార, మమకారాలను పూర్తిగా లేకుండ చేసుకొనడమే నిజమైన త్యాగం. జ్ఞాని అలాగ అహంకారాన్ని త్యజిస్తాడు.

## అంతరంగంలో నుండి ఆనందభూతి

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ । ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థిప్రజ్ఞస్తదోచ్యతే । అని భగవద్గీతలో అంటాడు. మొత్తంగా అన్ని కోరికలను మోక్షం కావాలన్న కాంక్షతో సహా పరిపూర్ణంగా త్యాగం చేసిన వ్యక్తి స్థితప్రజ్ఞుడని పిలువబడ డానికి అర్హుడు. అలాంటి వ్యక్తి ఆనందాన్ని ఎలాగ పొందగలడు? అహంకారంతో సహా అన్నీ వదులుకొన్న పరిస్థితిలో, అక్కడ కోరుకునేందుకు మరెవరూ వుండరు. వ్యక్తిత్వ భావన అన్నదే నశిస్తుంది. దేని వల్ల ప్రభావితం అయ్యే ప్రసక్తి లేదు. అందుకే బాహ్యం నుండి కాకుండ అంతరంగంలో నుండి ఆనందానుభూతి చెందడం జరుగుతుంది.

**రక్షింపు మనుచు వచ్చిన**
**పక్షులకును మోక్షమిచ్చి పాలించితివా**
**యక్షీణ కరుణ నన్ను**
**రక్షింపవె శాంతి నొసగి రమణా, రమణా.**

**హృదయ కమలదళంబుల జెదరకుండ**
**నక్షర స్వరూపుండవై యలరు నిన్ను**
**గర్మవాసన మసకగా గాంచలేక**
**హస్త లిఖితాక్షరముగోర నగునె రమణ.**

**-- సూరి నాగమ్మ గారు**

# శ్రీ దేవీ కాలోత్తర జ్ఞానాచారవిచార విభాగము

(గత సంచిక తరువాయి) తాడిమేటి సత్యనారాయణ

## 42వ పద్య తాత్పర్యము

ఆ పరావస్తువగు శూన్యవస్తువును, ఎవరు ధ్యానించి, ఆ ధ్యానాభ్యాసముచే తన్మయముగా అందే లయమగుచున్నారో, అటువంటివారు తప్పక జనన మరణ రహితము మహోన్నత స్థానమైన ముక్తిస్థితిని, పొందియే తీరుదురని గ్రహింపుము.

## వ్యాఖ్య

శూన్యమనునది సద్వస్తువగు పరావస్తువు. ఉన్నటువంటిది, ప్రకాశించే నట్టిది, జ్ఞానమైనట్టిదగు వస్తువును శూన్యమని చెప్పుట లోని భావము ఏమనగా : తాను మాత్రము "ఉన్నాను" అను స్ఫురణగా ప్రజ్ఞామాత్రముగ, స్వయంప్రకాశమై, తనను తాను తెలిసి కొనునదై, అనన్యమైన శూన్యముగా యుండుటచే, ఆ పరావస్తువే శూన్యమని చెప్పబడుచున్నది. అయితే అది జడమైన శూన్యము గాదు.

ఈ శూన్యమునుండే అసత్యరూపమగు అఖిల చరాచర ప్రపంచమూ, మాయ యొక్క సంకల్పముచే గోచరించి మాయమగుచున్నది. గోచరించు సకల రూపములకునూ కారణమైన బ్రహ్మమును నిరాకారమని చెప్పినట్లు, అఖిల భువనములను ప్రకాశింపచేయు, జ్యోతిర్మయమైన బ్రహ్మస్వరూపము శూన్యమనబడుచున్నది. ఈ శూన్యమును ధ్యానించుటచే, ధ్యానించువాని వాసనలు కొంచము కొంచము

కరిగి శూన్యమగుచున్నవి. అప్పుడు అతడు శూన్య ధ్యానమయుడు అగుచున్నాడు. అట్లుండుటచే అతని వాసనాబీజములు నశించు చున్నవి. జన్మహేతువులైన కర్మ బీజములు నశించుటయే, జనన మరణములనెడు ద్వంద్వములు అతనిని వీడిపోవుచున్నవి. ధ్యానము ధ్యేయము ఒకటియై యుండుటయే శూన్యము. పిదప మిగిలి యుండెడిది అనంతమైన మహానంద ముక్తిపదమే. ఆ ముక్తి స్థితిని సాధకుడు తప్పక పొంది తీరునని చెప్పుటలో, అతడే ముక్తి స్వరూపుడుగా నిలచి యుండునని భావము. అదియే వేదములలో చెప్పబడు బ్రహ్మభూయము (బ్రహ్మత్వము) అను స్థితి. ఈ బ్రహ్మత్వము యొక్క లక్షణమును గూర్చి శ్రీ మురుగనార్ తమ ''గురు వాచక కోవై'' గ్రంథములోని 1005వ పద్యములో ఇట్లు వివరించిరి:

'''ఏ స్థితిలో చూచుటకు ఏ ఒక విషయమును వుండుటలేదో, ఏ స్థితిలో వినుటకు ఏ ఒక విషయమును వుండుటలేదో, ఏ స్థితిలో తెలిసికొనుటకు ఒక విషయమును వుండుట లేదో ఆ జ్ఞాన స్థితియే (సహజత్వము) బ్రహ్మత్వమని తెలిసికొనుము''.

## 43వ పద్య తాత్పర్యము

ముక్తి పదమును పొందగోరి, ముముక్షువులు ఈశ్వరాది దేవతలను స్తుతించి కొలుచుటయును, అంబిక, దేవి మొదలైన వారిని పూజించి అర్చించుటయు, ఆ విధముగనే వేర్వేరుగా చెప్పబడు పాపమూ, (యజ్ఞ యాగాదుల వల్ల కలుగు) పుణ్యమూ, వాటిని చేయుటచే కలుగు ఫలములనూ, ఈ ఫలము లుండుటకు ఆశ్రయములూ, ఆశ్రయముగా నున్న విషయములున్నూ, విషయ

జ్ఞానమూ మొదలగు ఇవన్నియూ అతి పెద్ద సంసార బంధమగును.

**వ్యాఖ్య**

దేవతా మూర్తులను పూజించుటచే పుణ్యమూ, ప్రాణులను హింసించుటచే పాపములు కలుగుచున్నవి. పాపముచే దుఃఖము పుణ్యముచే సుఖము లభించు చున్నవి. ఇవి రెండును వేర్వేరైన, సమ్మతింపబడిన ఫలములు. ఈ పాప పుణ్యములు, ఫలితము లిచ్చు సమయము వచ్చు వరకు, వీటి ఆశ్రయము, ఇటువంటి అనేక విషయములకు, విషయజ్ఞానములకూ ఆశ్రయముగా నున్నవి. వీటిని గురించి ఆలోచించుటయే పెద్ద బంధము. ఆలోచించకుండ యుండుటయే దీని నుండి విడిపడుటకు (విముక్తి నొందుటకు) మార్గము.

కర్మములు చేసినచో కర్మఫలములు పొందబడుచున్నవి. కర్మములను బట్టి తగినట్లుగా ఫలములు కలుగుచున్నవి. కర్మఫలములు, అనుభవించువాని ఆశలకు తగినట్లు లేనిచో నిరాశచే, ద్వేషముచే దుష్కర్మలను చేయుటకు ఉపక్రమించు చున్నాడు. అందువల్ల కలిగిన దుఃఖము వద్దన్ననూ తప్పక వచ్చి అతనిని కష్టపెట్టుచున్నది.

ఇట్లు వీటిని అనేక విధములుగా నియంత్రించుట చేతనే దానిని ''మహా సంసార బంధ'' మంటారు. దీని నుండి తప్పించు కొనుటకుగాను ఒకే మార్గము, కర్మచేయువానిని పట్టి నాశము చేయుటచే కాకుండా కర్మ బంధముల నుండి విడపడుటయే యగును. సంసారమనునది వేరే లేదు. పైన చెప్పిన అన్ని బంధములూ కలసి సంసారమగును. బంధములు ఎక్కువగుతున్న కొద్దీ అది మహా సంసారమని పేరొందుచున్నది.

దేవుళ్ళు దేవీ స్వరూపులు అనగా, పూజింపదగు అర్చావతార మూర్తులగు ఈశ్వరాది దేవతలు.

పాపమో పుణ్యమో వెంటనే ఫలమునిచ్చుట లేదు. పరిపక్వ కాలము వచ్చిన తర్వాతనే అవి ఫలించుచున్నవి. అంతవరకు ఆ పాప పుణ్యములు దేని నాశ్రయించి ఫలితము నిచ్చు కాలము వచ్చు వరకు వేచి యుంటున్నవో, పండుచున్నవో, అదియే ఆశ్రయము అని చెప్పబడుచున్నది. సంసార మనునదే బంధములనెడి మాయ అగును.

## 44వ పద్య తాత్పర్యము

ఆశ్రయములుగా నున్నవన్నియూ, ద్వంద్వములని చెప్పబడు చున్నవి. ఆ ద్వంద్వములను వదలినచో పరావస్తువు అయిన తానే గోచరించును. అట్లు ఆ ద్వంద్వములను వదలిన మహాయోగి బంధములు లేని జీవన్ముక్తుడగుచున్నాడు. దేహమును వీడునపుడు, ఆ రోజు అతను విదేహ ముక్తుడు అనబడుచున్నాడు.

## వ్యాఖ్య

ద్వంద్వమంటేనే బంధము. ప్రపంచములో ఆశ్రయములుగా వున్నవన్నియూ ద్వంద్వములే. సుఖము నాశ్రయించునపుడు సుఖము మాత్రమే వచ్చుటలేదు. దానితోపాటు దుఃఖము కూడా వచ్చి వేధించుచున్నది. ఒక దానిని ఇష్టముతో కాంక్షించు నపుడు, దానికి విరుద్ధమైన దానిని (అడ్డముగా నున్న దానిని) ద్వేషించి త్రోసివేయుచున్నాము. ఒక వస్తువు కావలెనని తీవ్రముగ వెదకుచున్నాము. అదే సమయం ఇంకొక దానిని వద్దని త్రోసివేయు చున్నాము. ప్రేమించినవారితో వుండిన సంతోషము, వారి నుంచి వేరుపడినచో దుఃఖము చెందుతున్నాము. ఇవన్నియు కవలలు

అనబడు ద్వంద్వములు. ఇవి ఒకటి నొదలి మరొకటి యుండలేవు. ఇందు అనుకూలమైన దానిని వుంచుకొని ప్రతికూలమైన దానిని పోగొట్టలేము. ఈ ఆశ్రయములైన ద్వంద్వములవల్ల దుఃఖమే గాని శాశ్వతమైన సుఖము లేదు. ఈ ద్వంద్వములను వదలినగాని శాశ్వత సుఖము లేదు. సత్యవస్తువూ గోచరించదు. సత్యవస్తువు గోచరించిననే బంధరహితమైన జీవన్ముక్తి స్థితి సిద్ధించును. అట్లు సిద్ధించిననే శాశ్వత పరమానంద సుఖ స్వరూపమునందు ఉండగలము.

అందుచే ముక్తి నొందుటకు ఆశించు యోగి ద్వంద్వములను వదలిన యెడల, సద్వస్తువు గోచరించును. ఆ యోగి బంధరహిత జీవన్ముక్తుడగును. శరీరముతో తిరుగుచున్నంత వరకు అతను జీవన్ముక్తుడని పిలువబడుచున్నాడు. శరీరమును వదలు సమయమున విదేహముక్తుండుని చెప్పబడుచున్నాడు. ఎప్పుడూ మారని ద్వంద్వరహిత స్థితియే ముక్త స్థితియగును. శరీరముతో జీవించియున్నప్పుడే, ఎవడు శరీరము లేనివానిగ తనను భావించు చున్నాడో అతడే జీవన్ముక్తుడు. కనుక ముముక్షువు చేయవలసినది, పొందదగిన దేమనగా, తన యథార్థ స్వరూపమును కనబడకుండా చేసి, అహముగా రూపునొందిన అహంకారమును నాశమొనర్చి, తనను తానుగా తెలిసికొనుటయే, అదియే జీవన్ముక్తి. అన్నిటికంటె ఉన్నతమైన పరమ పదము.

### 45వ పద్య తాత్పర్యము

బుద్ధిమంతులైన వివేకులు, ఈ శరీరమును ద్వేషముతో నశింపచేయవలెనని భావించుట తగదు. అది వారు చేయవలసినది కాదు. ప్రపంచమున ఈ శరీరమును పుట్టించిన ప్రారబ్ధకర్మ తీరిన

వెంటనే, ఈ దేహము దానంతట అదే తీరిపోవును, పడిపోవునని గ్రహింపుము.

**వ్యాఖ్య**

ప్రారబ్ధముల చేతనే ఈ శరీరము కలుగుచున్నది. అట్లు వచ్చిన శరీరము ప్రారబ్ధకర్మలు తీరనంతవరకు పోదు. కర్మలు తీరిన వెంటనే ఎంత వేడుకొన్ననూ, ఉండదు. ఇది ఈశ్వర నియతి. ప్రతి జీవుడు తన ప్రారబ్ధమును తానే అనుభవించు చున్నాడు. ఈశ్వరుడు దానికి సాక్షిగా హృదయములో గోచరించుచున్నాడు. జీవితము ప్రారబ్ధానుసారము నడచునని తెలిసికొన్న వివేకులు, దేని కొరకును కలవరము చెందరు. ఏలయనగా ఇష్టమున్నను లేకపోయినను, ఎవరికైనను ప్రారబ్ధానుసారము అవి వచ్చి, తప్పకుండా ప్రారబ్ధములను బలవంతముగా అనుభవింపజేయును. కనుక వివేకి విరాగముచేత దేహమును వదలుటకు ప్రయత్నము చేయకూడదు. ప్రారబ్ధము తీరినంతనే దేహము తానే పోవును అని తెలుపుతున్నారు.

శరీరమును ప్రారబ్ధకర్మలు పోషించుచున్నవి. అవి తీరునంత వరకు అదియే దేహమును సంరక్షించి కాపాడుచున్నది. కర్మలు తీరిన వెంటనే ఎవరి అనుమతి కొరకు ఎదురుచూడక తానే నశించుచున్నది. ఇదే కర్మరహస్యము.

## 46వ పద్య తాత్పర్యము

హృదయకమలమున "నేను" అను స్ఫురణతో కూడిన, ఏ చిత్స్వరూపము ప్రకాశించుచున్నదో, ఆ వస్తువు నిర్మలముగను నిశ్చలముగనున్న దగును. అటువంటి స్వరూపమునందే పుట్టి

అణగుచున్న, అహంకారమును నిర్మూలించుటచే, ఆ చిత్స్వరూపమే ముక్తి సుఖమును యివ్వగలదని నిశ్చయించి ధైర్యముతో నుండుము.

## వ్యాఖ్య

కాన్పించుట అదృశ్యమగుటయు లేక, ఎల్లప్పుడు చిదాకాశ హృదయములో, "నేను నేను" అను స్ఫురణతో ఆత్మ స్వరూపము ప్రకాశించుచున్నది. సత్తను ఉన్న వస్తువే, తనను తెలిసికొను చిత్తన బడు ప్రజ్ఞయగును. ఆ వస్తువే నిర్మలముగా నిశ్చలముగానూ సదా శాంతి స్వరూపమైయున్నది. ఈ శాంతియే సుఖ స్వరూపము. ఈ మూడును (సత్, చిత్, ఆనందము) ఒకే వస్తువగు సచ్చిదానంద స్వరూపము యొక్క లక్షణము.

ఇటువంటి వస్తువునందు అసత్య దృశ్యముగా పుట్టు దేహాభిమానమును అహంకారమును నిర్మూలించిన, మిగులునది "అహమ"ను సద్వస్తువే. అహంకారమను పదమునందు గల 'కార' మనెడు ఆకారమును నిర్మూలించినచో వున్నది "అహమే".

మనస్సు యొక్క ఉపాధులను తీసివేసిన తాను ఆ స్వరూపమే అగుచున్నది. అదియే ముక్తి సుఖమును ఇవ్వగలదని తెలుపు చున్నారు. ముక్తి వేరు సుఖము వేరు కాదు. ముక్తియే సుఖ స్వరూపము. సుఖస్వరూపముగా నుండుటయే ముక్తి. ఇది దృఢమైనది చివరిదని నిశ్చయముతో నుండుము.

## 47వ పద్య తాత్పర్యము

ఎటువంటి ఉపాధులను చేరక, ఉన్నటువంటి చిత్స్వరూపము ఏదొకటి గలదో, ఆ పరావస్తువే నేనని ఎల్లప్పుడు నిరంతరం

ఆదరముతో ఆనందముతో ధ్యానించి, నీలోగల అన్ని విషయ బంధములను నీవు నాశము చేయుము.

**వ్యాఖ్య**

అసత్య రూపమగు ఈ ప్రపంచములో గల వస్తువులన్నిట యందు చేరి యున్ననూ, వాటి చిహ్నములైన నామ రూపములు. కనబడుట అదృశ్యమగుట అను గుణములతో చేరక, ఉపాధికి అతీతముగా నున్నదే ఆత్మవస్తువు. ఆ చిత్స్వరూపమునే, ఆ శివమే నేనని ఎప్పుడూ ఉత్సాహముతో ఆదరముతో ధ్యానించ వలయును. సద్వస్తువును అన్వేషించుటకు ప్రీతియు, తెలిసికొనవలెననెడు కోరిక యుండవలెను. అవి మిక్కిలి అవశ్యమైనవి. దైవమును ప్రీతితో ధ్యానించిననే అతనిని పొందగలము. ఎంతమంది భక్తులు దేవుని ప్రీతితో కొలిచి హృదయము ద్రవింప భక్తి పరవశములో మునగ లేదు? పాషాణమైన మనస్సు కరగుటకు హృదయము ద్రవించి మృదుత్వము నొందవలెను. ధైర్యసాహసములతో హృదయము గట్టి పడుతున్నది. మృదు స్వభావములచే మనస్సు మెత్తనగు చున్నది. ఇట్లు ప్రీతితో నిరంతరం ధ్యానము చేయుటవల్ల, ఇతనిలో నున్న ఎటువంటి ఆలంబములు మిగలక పూర్తిగ నశించి పోవును. కారణమేమనగా ఇతడే వాటిని ఆలంబము చేసికొనెను గాని ఆలంబములు వాటంతట అవే వచ్చి ఇతనిని ఆవరించలేవు. అవి జడమైనవి. జీవుడు అసత్యమైనప్పటికి చైతన్యాంశముతో కూడిన వాడు కాబట్టి అతను పట్టుకొనగలుగుచున్నాడు.

జీవుడు తనపట్టు నంతయు ఆ పరశివత్వమును పట్టుకొనుటలో నిరంతరమున్నచో, అతనిలో నున్న పట్టులన్నియూ

సడలి వదలిపోవుచున్నవి. ఆలంబములను వదులుకోవలెనన్న నిరాలంబమైనవానిని సదా ధ్యానించుటయే ఉత్తమమైన మార్గము.

**48వ పద్య తాత్పర్యము**

మనము వసించు దేశము గురించి, జన్మించిన జాతి గురించి, వాటికి సంబంధించినవియూ, దోషము లేనిదని భావింపబడు కులమూ, ఆ కులమునకు చెందిన సద్వర్తనలు, వాటికి చెందిన భావనలన్నిటినీ నిర్మూలించి, నేనను అహముదయించు స్వస్థితిని గురించిన భావమునే పట్టుకొని విడవక అభ్యసించుము..

**వ్యాఖ్య**

దేశము, జాతి, కులాచారమూ, వర్ణాశ్రమములు దానిని సంబంధించిన విధి నిషేధములూ, అనుష్ఠాన ఆరాధనలైన ఇవి యన్నియూ, ముక్తి నిచ్ఛగించు ముముక్షువునకు, భావనలే గాక, పెద్ద అడ్డంకులుగా (నిరోధకములుగా) నున్నవి. అందుచేతనే వీటిని పూర్తిగా త్రోసివేయుమని చెప్పుచున్నారు.

ముముక్షువు మనస్సున ఎటువంటి మనోభావములు లేక, అహము పుట్టిన స్థానమైన స్వస్థితినే అనుసరించి యుంచవలెను. ఈ ఒక్క భావననే పట్టుకొని అభ్యాసము చేస్తూ వచ్చిన, భావనా బలముచే ఆ స్వస్థితి లభ్యమగును. పైన చెప్పిన కట్టుబాట్లన్నిటినీ పూర్తిగ వదలిన మనస్సును అంతర్ముఖము చేసిన, అది తత్తరపాటు చెంది ఇహపరములు లేక తల్లడిల్లును. అట్లు చెడిపోకుండగా స్వస్థితి గురించిన భావమునే పట్టుకొని అభ్యసింపుమని ఉపదేశించుచున్నారు.

## 49వ పద్య తాత్పర్యము

నేను ఒక్కడిని మాత్రమే ఉన్నాను. నాకు స్వంతమైన వాడెవడూ లేడు. నేనూ ఒకడికి స్వంతముగాను, ఎవనికైతే నేను స్వంతమో అటువంటి వానిని కూడా నేను చూడలేదు. నాకు ఎవడైనా స్వంతమో యనిన అటువంటి వానిని నేను చూడలేదు. ఉన్నది నేను ఒకడినే.

### వ్యాఖ్య

పరవస్తువగు "నేను" అను వస్తువు యొక్క నిజస్థితిని, శాసించి చెప్పి వస్తు లక్షణము వివరింపబడుచున్నది. నేనను నన్ను తప్పించి వేరేదియును లేదని నిర్ధారించబడుచున్నది. నేను ఎవరికి స్వంతముగాదు అనగా యజమాని నగు చున్నాను. అయితే యజమానియైన నాకేదైన స్వంత వస్తువున్నదా అంటే అదీ లేదు.

సరే, వేరెవరికైనా నేను స్వంతమగుదునా అని చూచిన, అట్లు ఎవరూ ఎక్కడా వున్నట్లు తెలియటములేదు. ఒకవేళ నేను ఎవరికి స్వంతము కానిచో, నాకు ఎవడైనా స్వంతముగా ఉన్నాడాయని చూసిన, అట్లునూ ఎవరూ వున్నట్లు తోచుటలేదు. ఎలాగ చూసిననూ నన్ను తప్పించి ఎవరూ లేరన్నది నిశ్చయము. నేనే ఉన్నాను.

నాకు తప్ప వేరే వస్తువునకు ఉనికి లేనందువల్ల, అభేదమై ఏకముగా గోచరించు పూర్ణ జ్ఞానమే నా నిజ స్వరూపము. అదియే ఆత్మ. ఆత్మ తనకు అన్యముగా ఏ వస్తువు లేక, ఏక స్వరూపముగా ప్రకాశించు స్వభావము కలది కాబట్టి "వానిని నేను చూడలేదు" అని చెప్పబడినది. ఉన్నది "నేను" అను సద్వస్తువు ఒకటే అని నిరూపించబడుచున్నది.

## 50వ పద్య తాత్పర్యము

నా యథార్థమైన నిజ స్వరూపమే, అంతటా నిండిన ఏక వస్తువగు పరబ్రహ్మ స్వరూపము. జ్ఞానమూర్తియగు గురు రూపమే, ప్రపంచ కారకుడగు ఈశ్వర స్వరూపము, అను ఈ దృఢమైన నిశ్చయమును పొందినవాడే, స్థిరముక్తి నొందిన పురుషుడగును. దీనికి విరుద్ధమై తగని మార్గములలో పోవువాడు బంధములకు లోనగునని నీవు తెలిసికొనుము.

## వ్యాఖ్య

తన నిజస్వరూపమే పరబ్రహ్మ స్వరూపము. తనకు ఆ స్థితిని కలుగచేసిన గురునాధుని జ్ఞాన స్వరూపము, సృష్టికర్తయగు ఈశ్వర స్వరూపమేయని దృఢమైన నిశ్చయము కలిగినవాడే, ముక్త స్థితిని పొందిన పురుషుడని ఖచ్చితముగా చెప్పుచున్నారు.

గురు రూపముతో ఇక్కడకు వచ్చినది, అంతటా నిండిన పరవస్తువే యగుటచే గురు స్వరూపము ఆత్మకు వేరు గాదు. నీ మనసు పరిణతి పొందిన సమయమున, దైవము గురు రూపముతో నీ ముందు వచ్చి సత్యమును బోధించి, మనసును అంతర్ముఖము చేసి ఏకోన్ముఖమగునట్లు చేయుచున్నారు. ఈశ్వరుడు, గురువు ఆత్మ మూడు ఒక్కటే.

గురువు బయటనే గాక లోపలను కలరు. దేహాత్మభావము నశించువరకు, ఆయన బయట నుండి నిన్ను లోపలికి నెట్టి, లోపల నుంటూ లాగుకొనుచున్నాడు. నీవు లోపల అణగినపుడు ఆ శక్తిని గ్రహింపగలవని భగవానుని ఉపదేశము.

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

శ్రీరామకృష్ణ పరమహంస కథామృతాన్ని నేను నాల్గవసారో, ఐదవసారో చదువుతున్నాను. ఈ వేళ ఉదయము ఆ గ్రంథాన్ని చదువుతున్నప్పుడు కనిపించిన యీ విషయాన్ని పొందు పరుస్తున్నాను. అనుగ్రహ మహిమయెట్టిదో, అది మనలను ఎట్లు పునీతులను చేయునో మనకు తెలియపరుస్తుంది.

శ్రీరామకృష్ణులు: రాఖాల్ (స్వామీ బ్రహ్మానంద) బురద చేప వంటివాడు. ఆ చేప బురదలో వుంటుంది కానీ, ఆ బురద లేశమాత్రము కూడా దానికి అంటుకోదు.

గిరీష్: స్వామీ! ఇదంతా నాకర్థము కాదు. మీరు అందరినీ పవిత్రులను చేయగలరు. మీరు తలుచుకుంటే అందరినీ విరాగులుగా సజ్జనులుగా చేయగలరు. వాళ్ళు ప్రాపంచిక వ్యక్తులైనా సన్యాసులైనా! మలయమారుతము అన్ని వృక్షాలనూ గంధపు చెట్లుగా మార్చదా?

శ్రీరామకృష్ణులు: వాళ్ళలో అంతర్గతమైన శక్తి వుండాలి కదా. పత్తి చెట్ల వంటివి గంధపు చెట్లుగా మారవు.

గిరీష్: అది నా కనవసరం.

శ్రీరామకృష్ణులు: కానీ అది చట్టం.

గిరీష్: కానీ మీరు యే చట్ట పరిధిలోకీ రారు.

శ్రీ రామకృష్ణులు: అవును. అది సత్యమే కావచ్చును.

భక్తి అనే నది పొంగి ప్రవహిస్తున్నప్పుడు దగ్గరున్న ప్రాంతాలన్నీ మునిగి పోతాయి. భగవంతుని పై ప్రేమ పెంచుకున్న వ్యక్తికి మరేమీ అవసరముండదు.

అనుగ్రహానికి సంబంధించినదే మరో విషయంపై నేను శ్రీ భగవాన్‌తో చర్చించే వాడిని. నేనొక తమిళ గీతంలో ఆ గీతకారుడు తాను మర్కటకిశోరాన్ని కాననీ, నిస్సహాయురాలైన మార్జాల కిశోరాన్ననీ, తనను తల్లి పిల్లి మెడపట్టుకుని భద్రంగా తీసుకు పోయినట్లుగా భగవంతుడు తనను రక్షించాలనీ వేడుకొనడం చదివాను. ఆ పాటను శ్రీ భగవాన్‌కు చూపి, నా విషయం కూడా అట్లాంటిదేననీ, శ్రీ భగవాన్ నాయందు జాలిపడి, నా మెడపట్టుకుని నేను యెక్కడా పడిపోయి దెబ్బలు తినకుండా కాపాడాలనీ ప్రార్థించాను. శ్రీ భగవాన్ తమ సహజ ధోరణిలో సమాధాన మిచ్చారు. ఎవరెంత ఆర్తితో ప్రార్థించిననూ, వారి పరిస్థితి ఎంత దయనీయమైననూ శ్రీ భగవాన్ సమాధానము నాకిచ్చిన సమాధానముగానే వుండును గానీ మారదు- "అది అసాధ్యము. నీవు పడాల్సిన శ్రమ నీవు పడాలి. అప్పుడే గురుకృప లభిస్తుంది" అనేదే శ్రీ భగవాన్ సమాధానము.

మర్కట న్యాయమూ, మార్జాల న్యాయమూ మన శాస్త్రాలలో విస్తృతంగా విశదీకరింపబడినవి. ఈ విషయమే శ్రీ భగవాన్‌తో ప్రస్తావించి, రెండు మార్గాలూ శాస్త్ర సమ్మతమేననీ, అందువలన మా వ్యక్తిగత సామర్థ్యముల ననుసరించి మమ్ములను అనుగ్రహింప వలెనని యెంత అర్థించినా లాభం లేకపోయింది. ఎంత చెప్పినా,

శ్రీ భగవాన్ సమాధానం ఒక్కటే - యింతకు ముందు చెప్పిన విధానంగానే వుండేది.

పదేళ్ళ పాప కిట్టీ ఆస్‌బోర్న్ తన చదువు కోసం వేరే వూరు వెడుతూ, శ్రీ భగవాన్ తనను గుర్తుపెట్టుకోవాలని తండ్రి ద్వారా అడిగించింది. ఆ పాపకు కూడా, శ్రీ భగవాన్ ఎంతో ప్రేమ పూరిత మయిన చిరునవ్వుతో చూస్తూనే, "కిట్టి భగవాన్‌ను గుర్తుపెట్టు కుంటే, భగవాన్ కిట్టీని గుర్తు పెట్టుకుంటారు" అన్నారు.

శ్రీ భగవాన్ యొక్క యీ ధోరణి మట్టుకు యెప్పుడూ మారదు. శ్రీ రామకృష్ణ పరమహంస ఒకసారి అన్నారు. "అమ్మ నన్ను తీసుకు వెళ్ళిపోతున్నది. నేను అమాయకత్వంతో, అడిగిన వాళ్ళందరకూ ఆధ్యాత్మిక సంపదను పంచి పెట్టేస్తున్నాను," అన్నారు. కానీ శ్రీ భగవాన్ అలా కాదు. ఇతరుల అభిప్రాయాలు ఎలా ఉన్నా సరే, నేను మాత్రము శ్రీ భగవాన్ నిజస్వరూపాన్ని చిత్రించ ప్రయత్నిస్తాను. భక్తులు యింకా అర్హత సంపాదించ వలసి వచ్చినప్పుడు, కేవలం వారిపై కరుణతో గానీ, సానుభూతితో గానీ శ్రీ భగవాన్ ఆధ్యాత్మిక అనుభవాలు ప్రసాదించేవారు కాదు. భక్తుల నైజముల ప్రకారము శ్రీ భగవాన్ బోధన వుండేది. ఎవరికి ఏది మంచిదో శ్రీ భగవాన్‌కు క్షుణ్ణంగా తెలుసును. అందువల్ల వారి పట్ల నాకు ఆరాధనాభావము యింకా యినుమడించేది. ఒక్కోసారి నేను శ్రీ భగవాన్‌తో అనే వాడిని. "శ్రీ భగవాన్ యింత ఉన్నతస్థానములో వుండకుండా, కొద్ది స్థాయిలో వుండి, సిద్ధులులాంటివి ప్రసాదించితే, నా బోటి వాండ్లకు లాభించును". నేను ఈ మాట అనేవాడినే కానీ, నా వుద్దేశము నిజముగా అది కాదు.

గురుకృప వలన లాభము పొందదలిచిన శిష్యుడు

చేయవలసిన కృషికి సంబంధించిన శ్రీ భగవాన్ బోధ గురించి యింకొక ఉదాహరణ ప్రస్తావిస్తాను. కొద్ది కాలము క్రితము స్వర్గస్థులైన శ్రీ రాఘవ అయ్యంగార్ తిరువాన్కూర్‌లో అనుకుంటాను ఆస్థాన తమిళ కవి. వారి గురించి శ్రీ భగవానే నాకు తెలియపరిచారు. వారి రచనలు కొన్నింటిని నేను ఆశ్రమ స్తోత్ర గ్రంథములో చూసి నా నోటు పుస్తకములో రాసుకున్నాను. వాటిలో ఒక రచన యొక్క అర్థము యీ విధముగా వుంటుంది.

తల్లి స్తన్యము నిండా పాలున్ననూ, దగ్గరనే వున్న శిశువుకు ఆ సంగతి తెలియక పోవడమే కాక ఆ బిడ్డకు పాలుతాగు శక్తి వుండదు. అందువలన బిడ్డకు కావలసిన పోషణ లోపించి అది శుష్కించి పోవును. పాలకోసమ రోదించును. అందువలన బిడ్డకు స్తన్యము నిచ్చి అలక తీర్చు బాధ్యత తల్లిదే! అదే విధంగా, ఓ దేవా! మీ అనుగ్రహాన్ని నా మీద కురిపించే బాధ్యత మీదే. నా అంతట నేను ఆ అనుగ్రహాన్ని సంపాదించుకునే సమర్థత నాకు లేదు. మీరు అలా చేయకపోతే మీరే నిందపడాల్సి వస్తుంది.

ఒకసారి శ్రీ భగవాన్‌తో ఈ విషయమే ప్రస్తావిస్తూ ఈ కవితను వారికి చూపించాను. నాలాంటి వాళ్ళు, శ్రీ భగవాన్ అనుగ్రహం సంపాదించగల సమర్థులు కాదనీ, వారే తమ అనుగ్రహాన్ని నాపై కురిపించాలనీ ప్రాధేయపడ్డాను. నా వాదనను బలపరచడానికి రాఘవ అయ్యంగారి కవిత చూపి, నన్ను నేను సమర్థించుకొన ప్రయత్నించాను.

ఒక కవిగా, ఒక పండితునిగా రాఘవ అయ్యంగారి పట్ల శ్రీ భగవాన్‌కు గౌరవమున్ననూ, ఈ విషయంలో వారితో శ్రీ భగవాన్ ఏకీభవించలేదు. ముక్తసరిగా, ''ఏదో రాశారు,'' అని వూరుకొన్నారు.

శ్రీ భగవాన్ మర్యాదకు అలా అన్నారు కానీ, యింకెవరైనా ఐతే, ''ఆయన ఏమి రాస్తున్నారో ఆయనకే తెలియదు'' అనేవారు. అయితే అర్హత లేనట్లు కనిపించే భక్తుల పట్ల కూడా శ్రీ భగవాన్ తమ కరుణను కురిపించిన సందర్భాలు లేకపోలేదు. వారి అపార కరుణకు నేనే ఒక ప్రత్యక్ష సాక్షిని.

తమ ప్రవర్తనను మార్చుకొనని భక్తులు కూడా కోరుకున్నంత అమోఘంగా కాకపోయినా, శ్రీ భగవాన్ కరుణ వారల మీద ప్రభావం చూపించేది. సుబ్రహ్మణ్య స్వామిని భక్తులు ప్రార్థించే విధంగా శ్రీ భగవాన్‌ను స్తుతిస్తూ నేనొక పాట పాడాను. నన్ను సంస్కరించి నన్ను కాపాడారు అని నేను పాడటం శ్రీ మణవాసి రామ స్వామి అయ్యర్ విన్నారు. ''మీకు యీ పాటంటే చాలా ఇష్ట మనుకుంటాను. ఎంతో ఉత్సాహంగా పాడుతున్నారు. కానీ శ్రీ భగవాన్ కరుణనూ, శ్రీ భగవాన్ విశిష్టతనూ యీ పాట సంపూర్ణంగా వర్ణిస్తుందని నేననుకోను. ఇతర మహాత్ములు మనల్ని సంస్కరించి ఉద్ధరిస్తారేమో కానీ, మన భగవాన్ మనల్ని మనం ఎలా వుంటే అలాగే కడతేరుస్తారు. మనం బాగుపడే దాకా శ్రీ భగవాన్ వేచియుండరు''.

వారు తమ అనుభవం దృష్ట్యా చెప్పిన యీ మాట సత్యమని ఒప్పుకోక తప్పదు. నా విషయంలో మట్టుకు నేను ఖచ్చితంగా చెప్పగలను. నేను బాగుపడక ముందే శ్రీ భగవాన్ నన్ను ఆదుకున్నారు. మహాత్ములందరూ వర్ణించిన విధంగా, భగవంతని ప్రేమ తల్లి ప్రేమవంటిది. ఆ ప్రేమ తప్పులెన్నదు. ఎన్ని తప్పులున్నా తల్లి ప్రేమిస్తూనే వుంటుంది.

పుత్రుని దోషాలెన్నివున్నా, తల్లికి ఆ దోషాలన్నీ తెలిసినా కూడా,

ఎంతో ఓపికగా వాటినన్నింటినీ సహిస్తుంది. కుమారుని పట్ల ఎటువంటి కోపమూ ప్రదర్శించదు. అలాగే, భగవాన్, నా తప్పులెన్ని వున్నా వాటిని సహించి మీరు నన్ను ఆదుకోవటము మీ బాధ్యత

- శ్రీ రామలింగస్వామి

అన్నిటికన్నా ఉత్తమమైన మంత్రోపదేశము గురించి శ్రీ భగవాన్ చేసిన బోధన గురించి చాలామందికి తెలుసుకోవాలని వుంటుంది. 'కైవల్యము' వంటి మన ఆధ్యాత్మిక గ్రంథాలలో మూడు రకాల దీక్షల గురించి చెప్పబడినవి. గురువు తన కరుణను కేవలం తన సంకల్పముతో వర్షించగలరు- తాబేలు కేవలం తన గుడ్లను వాటి గురించి కేవలం తన ఆలోచనతో పొదిగినట్లు! రెండవ సామ్యము చేప తన గుడ్లను చూపుతో పొదిగినట్లు. అక్షర మణమాలలో శ్రీ భగవాన్ స్వయంగా "ఓ అరుణాచలా! నాకు నీ దృక్కులతో కానీ, సంకల్పముతో కానీ లేక నీ స్పర్శతో కానీ అర్హత ప్రసాదించి కాపాడుము" అని అన్నారు.

ఇదంతా ప్రస్తావిస్తూ నేను ఒకసారి శ్రీ భగవాన్‌తో ఇలా అన్నాను. "భగవాన్! మీరెప్పుడూ ఎవ్వరినీ స్పృశించరు. ఎందరో భక్తులు తమ పాదములకు శిరోవందనము చేయాలని తహతహ లాడెదరు కదా?"

"దీక్షకు మూడు మార్గాలున్న మాట వాస్తవమే. కానీ అన్నిటి కంటే సంకల్ప దీక్ష అత్యుత్తమమైనది," అని జవాబిచ్చారు శ్రీ భగవాన్.

(ఈ రచన శ్రీ రమణాశ్రమము ద్వారా ప్రచురింప బడిన 'మై రికలక్షన్స్ ఆఫ్ భగవాన్ శ్రీ రమణ మహర్షి' అనబడే గ్రంథము నుండి అనువదింపబడినది.)

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ సుందరం

మల్లాది ఫణిమాల

సుందరం (సాధు త్రివేది గిరి) గా ప్రసిద్ధికెక్కిన శ్రీ సుందరం ఆధ్యాత్మిక చింతన గల వ్యక్తి. వీరు 1933వ సంవత్సరంలో శ్రీ రమణాశ్రమం వంటింట్లో పనికి చేరారు. ఎన్నో సంవత్సరాలు శ్రీ రమణాశ్రమం వంటింట్లో అవిరామంగా పనిచేశారు.

శ్రీ సుందరం సుబ్రహ్మణ్యేశ్వర ఆరాధన చేసేవారు. 1932వ సంవత్సరంలో వీరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ ప్రాంగణంలో విగ్రహం ముందు నిలిచి నమస్కరిస్తున్నప్పుడు ఈ మాటలు వినబడ్డాయి. ''ఎవరితోనూ మాట్లాడని దేవుడను నేను. తిరువణ్ణామలైకి వెళ్ళు! మాట్లాడే దేవుడు అక్కడి మహర్షి!''

సద్గురుని కృపాకటాక్షములు ఈ సుబ్రహ్మణ్యేశ్వరుని ద్వారా, ఈ విధంగా శ్రీ సుందరానికి లభించాయి. అప్పటివరకు వారు ఎన్నడూ మహర్షిని దర్శించలేదు. 1933వ సంవత్సరంలో అనుకోకుండా వారి భార్య మరణించారు. అటు పిమ్మట శ్రీ సుందరం ఉద్యోగానికి రాజీనామా చేసి శ్రీరమణ దర్శనార్థం అరుణాచలానికి బయలుదేరారు. శ్రీ సుందరం గారి కుటుంబంతో చక్కటి సంబంధ బాంధవ్యాలు కలిగిన సర్వాధికారి వారిని వెంటనే శ్రీరమణాశ్రమంలో పని చేయుడానికి చేర్చుకున్నారు. శ్రీ రమణాశ్రమానికి రాక మునుపు ఎన్నో సంవత్సరాలుగా ఆస్తమా రోగము శ్రీ సుందరాన్ని పట్టి పీడిస్తున్నది. ఎన్నో మందులు

వాడినప్పటికీ వారికి ఏ మాత్రం ఉపశమనము కలగలేదు. ఈ ఆస్తమా వ్యాధిని గురించి వారు ఎన్నడూ శ్రీరమణులతో చెప్పుకోనూ లేదు. ఒక రోజు శ్రీ రమణులు స్వయంగా తయారు చేసిన పచ్చడిని ఒక చిన్న ముద్దగా చేసి శ్రీ సుందరం గారి చేతిలో పెట్టి, "ఇది నీకు మందు. దీనిని నోట్లో వేసుకుని మింగు". అని అన్నారు. శ్రీ సుందరం రమణులు చెప్పినట్లుగానే ఆ పచ్చడి ముద్దను మింగేశారు. ఆశ్చర్యమైన విషయం ఏమిటంటే ఆ తర్వాత ఆస్తమా ఎన్నడూ వారిని ఇబ్బంది పెట్టలేదు. వారికి పూర్తిగా నయమై పోయింది. "ఓం భవరోగ భిషగ్వరః"అనేటటువంటి మంత్రాన్ని అనుసరించి శ్రీరమణులు భవరోగాన్ని, భవసాగరంలో మనలను పట్టి పీడించే ఇతర రోగాలను కూడా నయం చేయగలరన్నది నిజమని శ్రీ సుందరం గారికి అర్థమైంది.

శ్రీరమణాశ్రమానికి వచ్చిన భక్తులందరూ చీకటి పడేసరికి ఎవరి ఇళ్ళకి వాళ్లు వెళ్లిపోయేవారు. ఇలా రాత్రుళ్ళు బయట వాళ్లంతా వెళ్లిపోయాక ఆశ్రమంలో ఉన్న భక్తులందరూ కుటుంబ సభ్యుల వలే శ్రీ రమణుల చుట్టూ చేరేవారు. అప్పుడు శ్రీ రమణులు అందరి యోగక్షేమాల గురించి ముచ్చటించేవారు. అంతేకాదు భక్తులందరినీ నవ్వించేవారు కూడా. మరునాటి పనిని గురించి కూడా చక్కగా విశదపరిచేవారు.

ఒకనాడు తెల్లవారుజామున శ్రీరమణులతో బాటు సుందరం గారు కూరలు తరుగుతుండగా వారు, "సుందరం! ఈ లాంతరు తీసుకెళ్ళి రాలిన మామిడి కాయలని ఏరి పట్టుకురా" అన్నారు. సుందరం సరేనన్నారే గాని కూరలను తరుగుతూనే ఉన్నారు. అప్పుడు శ్రీ భగవాన్, "నేను చెప్పిదానిని ముందు చెయ్యి. అన్నీ

“నా” నుంచే ఉదయిస్తాయి. మొదట ఆ పనిచేయి” అన్నారు. “నేనెవరిని” అను విచారణ చేయటానికి ఇది వారిచ్చిన ఆదేశం గానూ, ఉపదేశంగానూ భావించారు, శ్రీ సుందరం.

మరొక సందర్భం చూద్దాం. ఒకనాడు పరిచారకుడు మాధవన్ ఒక పుస్తకానికి అట్ట అంటిస్తుండగా ఒక భక్తుడు లైబ్రరీ నుండి వచ్చి తనకొక పుస్తకం కావాలన్నాడు. శ్రీ భగవాన్ మాధవన్ని వెళ్లి ఆ పుస్తకాన్ని పట్టుకురమని చెప్తూ, “నా పనిని నువ్వు చెయ్యి, నీ పనిని నేను చేస్తాను” అన్నారు. శ్రీ భగవాన్ ఆ పుస్తకానికి అట్ట అంటించటం ప్రారంభించారు. మాధవన్ లైబ్రరీకి వెళ్ళారు. ఇలా చిన్న చిన్న పనులు కూడా ఆనందానికి బాటలు అయ్యేటట్లుగా శ్రీరమణులు తీర్చిదిద్దేవారు. వారి చుట్టూ చేరిన భక్తులకు, పరిచారకులకు జీవితంలో చిన్న చిన్న విషయాల ద్వారా వేదాంతాన్ని ఆచరణపరంగాను, సిద్ధాంతపరంగాను కూడా బోధించి వారిని అంతర్ముఖత్వం వైపు మళ్ళించేవారు శ్రీరమణులు. ఆత్మ శోధనకి కావలసిన చక్కటి లక్షణాలను వారు ఎంతో నేర్పుతో ఓర్పుతో బోధించేవారు.

భక్తుల శ్రేయస్సు మరియు వారి బాగోగులు శ్రీ రమణులు ఎంతో శ్రద్ధగా చూసుకునేవారు. ఒకసారి మేజర్ చాడ్విక్ జ్వరంతో మంచం పట్టారు. చాడ్విక్ పట్ల వారికి గల ప్రేమానురాగాలను వ్యక్తపరుస్తూ శ్రీరమణులు, “చాడ్విక్ తన ఊరిని, తనవారిని విడిచి కొన్ని వేల మైళ్ళు ప్రయాణం చేసి మనలో ఒకడిగా ఉండాలని ఇక్కడకు వచ్చారు. అటువంటి భక్తుడి గురించి మనం ఎంతో శ్రద్ధ తీసుకోవాలి కదా!! ఆయన అవసరాలన్నీ చూసుకోవలసిన బాధ్యత మన మీద ఉంది” అని అన్నారు. తోటి భక్తులతో ఈ

విషయాన్ని పంచుకుంటూ శ్రీ సుందరం శ్రీ రమణులకు వారి వద్దకు చేరిన వారిపై అమితమైన అక్కర ఉండేదని చెప్పారు.

ఒకరోజు శ్రీ సుందరం భోజనశాలలో అన్నం వడ్డిస్తూ శ్రీరమణులకు మామూలు కన్నా ఎక్కువ వడ్డించడం జరిగింది. అది గమనించిన శ్రీరమణులు సుందరాన్ని ఉద్దేశించి, ''ఇలా తారతమ్యాలు చూపించడం చాలా తప్పు. నా పట్ల పక్షపాతం చూపటం సుందరంలో ఉన్న అహం వల్లనే జరిగింది'' అని అన్నారు. ఎవరైనా శ్రీరమణుల పట్ల మిగిలిన వారి కంటే ఎక్కువ ప్రేమను, శ్రద్ధను కనపరిచినప్పుడు శ్రీరమణులు వారిని సభాముఖంగా ఖండించేవారు. కానీ అలా ఖండించి వారిని సరిదిద్దుతున్నప్పుడు కూడా శ్రీ రమణుల మాటలలో ప్రేమ, వాత్సల్యము మాత్రమే కనిపించేవి.

ఒకానొక రోజు శ్రీ భగవాన్ సన్నిధిలో ధ్యానం చేసుకుంటున్నప్పుడు శ్రీ సుందరం గారి మనస్సు చలించడం ప్రారంభించింది. దానివల్ల వారికి ధ్యానం సరిగ్గా కొనసాగలేదు. ధ్యానాన్ని ఆపివేసి సుందరం కళ్ళు తెరిచారు. కళ్ళు తెరిచిన సుందరం గారిని చూసి శ్రీరమణులు, ''ఓహో! చలించడం మనసు యొక్క స్వభావం అనుకుని ధ్యానాన్ని నిలిపివేశామన్నమాట! సుందరం, ఇది ఎప్పుడు గుర్తుపెట్టుకో... మనం ఏది అలవాటు చేసుకుంటే అదే స్వభావంగా మారుతుంది. మనసుని నిరోధించడాన్ని విడవకుండా అలవాటు చేసుకుంటే అదే స్వభావమవుతుంది'' అని ఎంతో చక్కటి ఉపదేశాన్ని సుందరానికి శ్రీరమణులు అనుగ్రహించారు.

శ్రీ రమణాశ్రమ వంటశాలలో పనిచేయటానికి చేరిన

సుందరం గారికి ప్రతిరోజు శ్రీరమణులను, వారి పద్ధతులను చూసి ఎన్నెన్నో చక్కటి విషయాలు నేర్చుకునే అవకాశం కలిగింది. దక్షిణాదిన అగ్ర కులాల వాళ్ళు చద్ది అన్నం, క్రితం రోజు చేసిన పదార్థాలు బొత్తిగా తినేవారు కాదు. కానీ దేనినీ వృథా చేయకుండా ఉండడమే అన్నిటికంటే ముఖ్యమైన అంశమని శ్రీ రమణులు బోధ చేసేవారు. చద్ది అన్నం మరియు క్రితం రోజు వండినవి బిచ్చగాళ్ళకు ఇవ్వటాన్ని కూడా శ్రీ రమణులు అంగీకరించేవారు కాదు. మిగిలిన వాళ్లకు తినటానికి పెట్టే పదార్థాలే బిచ్చగాళ్లకు కూడా ఇవ్వాలని వారు అనేవారు. క్రితం రోజు ఆహారాన్ని కుక్కలకు కూడా ఇవ్వకూడదని వారి ఉద్దేశ్యం. శ్రీరమణులు తెల్లవారు జాముననే వంటింట్లోకి వచ్చి క్రితం రాత్రి భోజనం చేయగా మిగిలిన పదార్థాలన్నీ చూసి వాటికి ఏవేవో కలిపి అమితమైన రుచిగా తయారు చేసేవారు.

శ్రీరమణుల వైభావాన్ని గురించి వర్ణిస్తూ, సుందరం ఇలా అన్నారు. ‘‘శ్రీ రమణులు విప్లవకారులు కారు.... సంస్కర్తలు కారు... ఎవరి ఆచారాలను వారు తమ తమ ఇళ్ళలో నిరభ్యంతరంగా పాటించుకోవడానికి ఏ అభ్యంతరము చెప్పేవారు కారు. కానీ ఆశ్రమానికి సంబంధించినంత వరకు ఏ ఆచారము అనాలోచితంగా అనుసరించనక్కర్లేదు అని వారు అనేవారు. శ్రీ రమణాశ్రమంలో శ్రీ రమణులే మతం! వారే ఆచారం!! శ్రీ సుందరం గారు చెప్పిన ఈ మాటలు వారి గురు భక్తికి నిలువెత్తు నిదర్శనాలు. ఆధ్యాత్మిక ఆకాశంలో వెలుగై వెలసిన శ్రీ రమణులతో జీవితాన్ని గడిపిన శ్రీ సుందరం గారి భాగ్యము ఎంత వర్ణించినా తక్కువే మరి.

## Becoming Fearless

Talk 70

Dr K Subrahmanian

When we see the people around us, what strikes us are the differences. There are so many varieties of human beings with respect to the physical, mental and spiritual traits. We have minds of our own, and bodies of our own - there is no uniformity in this. Some people are rich, some are poor, some are intelligent, some are not so intelligent - there is such a rich variety in this world. Each one of us is endowed with some talent, and each one has a job. In spite of the many differences, we notice that almost everybody, irrespective of his status, his talent or his worth, suffers from the problem of fear. No matter who we are, every one of us is afraid of something or the other. This fear that we experience is not something that happens every now and then; it is an everyday occurrence. In other words, what is common to all of us is *bhaya*.

There are many things that we are afraid of. We are afraid of death, we are afraid that we may not get a job, we are afraid that our children may not prosper in the way we want them to, we are afraid that we may die before our responsibilities are over, etc. When your wife or your children don’t return home at the scheduled time, fear overtakes you. You remain paralysed. You worry about what might have happened to them. When you think about it, such worries are a daily occurrence. In fact, what tires

us out at the end of each day is not the result of what happened during the course of the day, but our thoughts relating to what might have happened. The various possibilities that could have gone wrong frighten us.

